క్లుప్తంగా

మొక్కులు చెల్లించుకున్న బీజేపీ నాయకులు



ఏడుపాయల అమ్మవారిని దర్శించుకున్న చేగుంట బీజేపీ నాయకులు

చేగుంట(తూప్రాన్): మెదక్ ఎంపీగా రఘునందన్‌రావు గెలిచిన సందర్భంగా ఏడుపాయల దుర్గాభవానీ ఆలయంలో మొక్కులు చెల్లించుకున్నట్లు బీజేపీ మండలాధ్యక్షుడు భూపాల్ తెలిపారు. ఎంపీగా రఘునందన్‌రావు బీజేపీ తరఫున గెలిస్తే ఏడుపాయల్లో ప్రత్యేక పూజలు చేస్తామని మొక్కుకున్నట్లు తెలిపారు. రఘునందన్‌రావు గెలిచిన సందర్భంగా శనివారం అమ్మవారికి పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నట్లు తెలిపారు. ఏడుపాయలకు వెళ్లిన వారిలో నాయకులు సంతోష్‌రెడ్డి, బీజేవైఎం మండలాధ్యక్షుడు చంద్రశేఖర్, జిల్లా ఉపాధ్యక్షులు ఎల్లారెడ్డి, యూత్ నాయకులు రతన్ తదితరులు ఉన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో వైద్యచికిత్సలు



అంగన్‌వాడీ కేంద్రంలో వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న ఏఎన్‌ఎంలు, ఆశవర్కర్లు

కౌడిపల్లి(నర్సాపూర్): అంగన్‌వాడీ కేంద్రాల్లో వైద్యసిబ్బంది లబ్ధిదారులకు చికిత్సలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. శనివారం మండలంలోని కొట్టాల, పాంపల్లి, దేవులపల్లి, ముట్రాజ్‌పల్లి తదితర గ్రామాల్లో ఏఎన్‌ఎంలు గర్భిణులు, బాలింతలు, చిన్నపిల్లలకు వైద్యచికిత్సలు చేశారు. అవసరం ఉన్నవారికి వ్యాధి నిరోధక టీకాలు వేశారు. మహిళలు రక్తహీనతను నివారణకు అంగన్‌వాడీ కేంద్రాల్లో పౌష్టికాహారం సద్వినియోగం చేసుకోవాలని పాలు, కోడిగుడ్లు, ఆకుకూరలు ఎక్కువగా తినాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల అంగన్‌వాడీ టీచర్లు రాజేశ్వరీ, రాణి, అనురాధ, నాగరాణి ఏఎన్‌ఎంలు, ఆశవర్కర్లు పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి నివారణకు కృషి



పంప్‌సెట్‌ను ప్రారంభిస్తున్న పీఏసీఎస్ చైర్మన్

శివ్వంపేట(నర్సాపూర్): తాగునీటి ఎద్దడి నివారణకు తనవంతు కృషి చేస్తున్నట్లు పీఏసీఎస్ చైర్మన్ చింతల వెంకట్‌రామిరెడ్డి అన్నారు. మండల పరిధిలోని కొంతన్‌పల్లి గ్రామంలోని 9వ వార్డులో నీటి సమస్యతో కాలనీ వాసులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయం తెలుసుకొని రూ. 25 వేల సొంత నిధులతో శనివారం బోరుబావి పంప్‌సెట్ ఏర్పాటు చేసి ప్రారంభించారు. నీటిని వృథా చేయకుండా పొదుపుగా వాడుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు వెంకటేష్, భిక్షపతి, స్వామి, అశోక్, శ్రీనివాస్, శంకర్, రవీందర్ తదితరులు ఉన్నారు.

ఓపెన్ జిమ్‌కు విరాళం



విరాళం అందిస్తున్న బీఆర్‌ఎస్ మెదక్ జిల్లా ఇన్‌చార్జి కంఠారెడ్డి తిరుపతిరెడ్డి

నిజాంపేట(మెదక్): మండల కేంద్రంలో ఓపెన్ జిమ్ కోసం ఆరోగ్యమే మహాభాగ్యం సభ్యులకు బీఆర్‌ఎస్ మెదక్ జిల్లా ఇన్‌చార్జి కంఠారెడ్డి తిరుపతిరెడ్డి విరాళం అందించారు. ఈ మేరకు శనివారం మండల కేంద్రంలో ఓపెన్ జిమ్ ఏర్పాటు చేయాలని విరాళాలు సేకరిస్తున్నారు. గ్రామస్తుల ఆర్థిక సాయంతో జిమ్‌ను ఏర్పాటు చేశారు. కానీ పూర్తి కాలేదు. దీనికోసం తిరుపతిరెడ్డి తన వంతుగా ఓపెన్ జిమ్‌కు రూ. ఒక లక్ష విరాళం అందించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు జితేందర్ గౌడ్, బాపురెడ్డి, మావురం రాజు, చంద్రం, రామాగౌడ్, వెంకటేశం, రవి, గౌస్, వెంకటస్వామి, నగేష్, చింతల స్వామి, తిరుపతి, మహేశ్, జీపీ స్వామి, వినయ్, బాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు మహంకాళి బోనాల జాతర

మిరుదొడ్డి(దుబ్బాక): ఆషాఢ మాసం సందర్భంగా రెడ్డి సంఘం ఆధ్వర్యంలో ఆదివారం మిరుదొడ్డిలోని మహంకాళి అమ్మవారికి బోనాల జాతర నిర్వహించనున్నట్లు ఆ సంఘం అధ్యక్షుడు భగవంతరెడ్డి శనివారం తెలిపారు. అమ్మవారికి సామూహిక పూజలు నిర్వహిస్తామని తెలిపారు.

ఉత్సవాలకు వేళాయే..


- నేటి నుంచి జైన మందిరంలో ఉత్సవాలు
- నిత్య అభిషేకాలు, పూజలు
- ప్రత్యేక ఆకర్షణగా 11 అడుగుల ఏకశిలా విగ్రహం



కొల్చారంలోని జైన మందిరం



ఆలయంలోని గోశాల



ఆలయంలో కొలువైన 23వ జైన తీర్థంకరుడు

కొల్చారం(నర్సాపూర్): జిల్లాలోని కొల్చారం మండల కేంద్రం తనలో దాచుకున్న చరిత్రను నలుదిశల వ్యాప్తి చేసేలా ఇక్కడ నిర్మించిన జైన దేవాలయం విరాజిల్లుతోంది. జైన సిద్ధాంతాలను వ్యాప్తి చేయడంలో ఈ దేవాలయం ప్రత్యేక స్థానాన్ని సాధించింది. పార్శ్వనాథుడి దర్శనంతో తమ కోరికలు తీరుతున్నాయన్న నమ్మకాన్ని అటు జైనులు ఇటు ఇతర ధర్మాలను ఆచరించేవారు బలంగా చాటుతున్నారు. ఇంతటి చరిత్ర కలిగిన కొల్చారంలోని జైన మందిరంలో ఆదివారం నుంచి ఈనెల 23 వరకు ప్రత్యేక ఉత్సవాలు జరగనున్నాయి. ఈ ఉత్సవాల్లో పాల్గొనేందుకు జైన దిగంబర స్వాములు ఇప్పటికే ఆలయానికి చేరుకున్నారు.

విగ్రహం బయటపడిందిలా..

కొల్చారం మండల పరిసర ప్రాంతాలను పరిపాలించిన ఎంతోమంది రాజులు ఇక్కడ మతాలను, సంగీత, సాహిత్య, శిల్పకళను ప్రోత్సహించడానికి ఇక్కడ ఎక్కడ తవ్వకాలు చేపట్టిన ఏదో ఒక శిల్పం, కట్టడాలకు సంబంధించిన ఆనవాలు కనిపిస్తూనే వస్తాయి. కాళిదాసు సంస్కృతంలో రచించిన పంచమ కావ్యాలకు తెలుగు వ్యాఖ్యానం రచించిన సుప్రసిద్ధ కవి శ్రీ మల్లినాథ సూరి ఇక్కడి వాడే కావడం ఇక్కడి సాహిత్య కళకు ఒక నిదర్శనం. అది పురాతన వీరభద్రాలయం పక్కన 1984లో ఇంటి నిర్మాణానికి పునాదులు తీస్తుండగా.. భారీ విగ్రహం ఒకటి బయటపడింది. ప్రధాన విగ్రహం పూర్తి దిగంబరంగా 11 అడుగుల ఎత్తు, 3 అంగుళాల అడ్డంతో తలపై ఏడు సర్పాలు కిరీటంగా దాల్చిన నల్ల చలువరాత్తు చెక్కిన ఏకశిలా విగ్రహం కనిపించింది. అది తామ గ్రామ దేవతగా భావించిన అక్కడి గ్రామస్తులు దొరికిన చోటే పూజలు నిర్వహిస్తూ వచ్చారు. విగ్రహం తాలూకు ఫొటోలు బయటకు రావడంతో జైనులు విగ్రహంపై ఆరా తీయడం చేశారు. విగ్రహం పాదాల కింద పాలీ భాషలో లిఖించబడ్డ అక్షరాలను బట్టి అది జైనుల 23వ తీర్థంకరుడైన పార్శ్వనాథుడిగా గుర్తించారు. ఈ విగ్రహం 11వ శతాబ్దానికి చెందిన కల్యాణి చాళుక్యుల కాలం నాటిదిగా చారిత్రక ఆధారాల ద్వారా తెలియ వచ్చింది.

ఆలయ నిర్మాణానికి బీజం..

విగ్రహం తాలూకు విషయం తెలుసుకున్న దేశంలోని నలుమూలలకు చెందిన జైనులు తరలివచ్చి దర్శించుకొని, విగ్రహాన్ని ఇక్కడి నుంచి తరలించేందుకు పూనుకున్నారు. గ్రామస్తులు మాత్రం తమ ప్రాంతానికి చెందిన విగ్రహాన్ని ఎక్కడికి తరలించేది లేదని, కారాకండిగా ఉండడం, 1995 వరకు గ్రామస్తులు జైనుల మధ్య చర్చలు కొనసాగుతూ వచ్చాయి. ఎట్టకేలకు గ్రామస్తుల కోరిక మేరకు ఆల్ ఇండియా జైన్ సంస్థ ఇక్కడే ఆలయ నిర్మాణానికి చర్యలు చేపట్టారు. ప్రస్తుతం మెదక్ నుంచి నర్సాపూర్‌కు వైపు వెళ్లే జాతీయ రహదారి కుడివైపున 1996లో మూడు ఎకరాల స్థలాన్ని దేవాలయ నిర్మాణం కోసం కొనుగోలు చేసి, ఆలయ నిర్మాణాన్ని చేపట్టారు.

ఇలా చేరుకోవచ్చు..

కొల్చారంలోని జైన మందిరం ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 6 వరకు తెరిచి ఉంటుంది హైదరాబాద్ నుంచి వచ్చేవారు బాలానగర్ మీదుగా నర్సాపూర్ అటువైపు మెదక్ వెళ్లే మార్గంలో నర్సాపూర్ నుంచి 35 కిలోమీటర్ల దూరంలో ఉంటుంది. బస్సుల్లో వచ్చేవారు ఈ మార్గం ద్వారా ఆలయానికి చేరుకోవచ్చు. ప్రతీ అరగంటకు ఎక్స్ ప్రెస్, ఆర్డినరీ బస్సులు అందుబాటులో ఉంటాయి.

దిగంబరస్వాముల పాదయాత్ర



కౌడిపల్లి నుంచి పాదయాత్రగా వెళ్తున్న భక్త బృందం



దిగంబర స్వాముల బృందం సభ్యులు

కౌడిపల్లి(నర్సాపూర్): జైన్‌మందిర్‌కు దిగంబరస్వాములు పాదయాత్రగా తరలి వెళ్లారు. శనివారం కౌడిపల్లి నుంచి కొల్చారంలోని జైన్ మందిర్‌కు జైన్ మతగురువు అంతర్మన్ ఆచార్ ప్రసన్నసాగర్‌జీ మహారాజ్ దిగంబరస్వామితో పాటు పలువురు దిగంబరస్వాములు, భక్తులు కలిసి ఊరేగింపుగా వెళ్లారు. రెండు రోజులుగా కౌడిపల్లిలోని మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి స్వగృహంలో ఉన్నారు. శనివారం కొల్చారం బయలుదేవి వెళ్లారు. చతుర్మాసదీక్షలో భాగంగా నాలుగు నెలల పాటు దిగంబర స్వాములు జైన్‌మందిర్‌లో ఉంటారని అనంతరం బద్రీనాథ్ ఆలయానికి పాదయాత్రగా వెళ్తారని భక్త బృందం సభ్యులు, భక్తులు దిగంబరస్వామిని దర్శించుకున్నారు.

ముస్తాబైన నల్లపోచమ్మ ఆలయం

రామాయంపేట(మెదక్): మండలంలోని ప్రగతి ధర్మారం గ్రామంలో ఆషాఢ బోనాల ఉత్సవాలకు నల్లపోచమ్మ ఆలయం ముస్తాబైంది. ఆషాఢ మాసాన్ని పురస్కరించుకొని గ్రామంలోని రెడ్డి సంఘం వారు ఉత్సవాలకు ఏర్పాట్లు చేశారు. ఈ మేరకు ఆలయాన్ని విద్యుద్దీపాలతో అలంకరించారు. ఆదివారం పూజా కార్యక్రమాలతో పాటు బోనాల ఊరేగింపు ఉంటుందని సంఘం సభ్యులు తెలిపారు. ఈ ఉత్సవాల్లో గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొననున్నారు.



విద్యుద్దీపాలతో వెలుగుతున్న పోచమ్మ ఆలయం

కాల్వ వద్దని రైతుల దీక్షలు

నర్సాపూర్: సంగారెడ్డి రీచ్–2 కాల్వ వద్దంటూ రైతులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు శనివారం రెండవ రోజుకి చేరాయి. కొండ పోచమ్మ కాల్వ వద్దు, సెమి అర్బన్ ముద్దు నినాదంతో రైతులు నర్సాపూర్ చౌరస్తాలో రిలే నిరాహార దీక్షలు కొనసాగిస్తున్నారు. సంగారెడ్డి కాల్వ ఏర్పాటు చేసే గ్రామాలకు చెందిన రైతులు మహేశ్‌గౌడ్, శ్రీకాంత్‌రెడ్డి, కిష్టాగౌడ్, కొమురమ్మ, మల్లమ్మ, రాంకిషన్, కొండల్, యాదాగౌడ్ తదితరులు రిలే దీక్షల్లో పాల్గొన్నారు.



నర్సాపూర్‌లో చేపట్టిన రిలే నిరాహార దీక్షల్లో పాల్గొన్న ఆయా గ్రామాల రైతులు

నేషనల్‌మెరిట్ స్కాలర్‌షిప్‌కు విద్యార్థులు



మెరిట్ స్కాలర్‌షిప్‌కు అర్హత సాధించిన చేగుంట మోడల్ పాఠశాల విద్యార్థులు

- అర్హత సాధించిన 22 మంది

చేగుంట(తూప్రాన్): నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్‌కు చేగుంట మోడల్ పాఠశాల నుంచి 22 మంది విద్యార్థులు అర్హత సాధించినట్లు ప్రిన్సిపాల్ భూపాల్‌రెడ్డి తెలిపారు. మెరిట్ స్కాలర్‌షిప్‌కు అర్హత సాధించిన విద్యార్థుల వివరాలను ఆయన వెల్లడించారు. మోడల్ పాఠశాల నుంచి ప్రస్తుతం 9వ తరగతి చదువుతున్న హరికిరణ్, బండి శ్రేనిక్, వైష్ణవి, భరత్‌కుమార్, ఆదిత్య, నాగప్రియ, అభినయ, ప్రణీత, అలీనహరేన్, మేఘన, వర్షిత, ప్రణతి, ఇందూ, నెనావత్ ఐశ్వర్య, కార్తిక్, వరుణ్, మనుసింగ్, హారిక, శృతి, అస్మిత్ రాజ్, శ్రీనాథ్, చైతన్యపవార్, మెదక్ జిల్లాలో ఎన్‌ఎంఎంఎస్ స్కాలర్‌షిప్ కోసం 61 మంది విద్యార్థులు ఎంపిక కాగా చేగుంట మోడల్ పాఠశాల నుంచి అత్యధికంగా 22 మంది విద్యార్థులు అర్హత సాధించినట్లు తెలిపారు. వీరికి నాలుగు సంవత్సరాల పాటు కేంద్ర ప్రభుత్వం ప్రతీ నెల రూ.1,000ల స్కాలర్‌షిప్ అందిస్తుందని ప్రిన్సిపాల్ తెలిపారు. ఎక్కువ మంది విద్యార్థులు నేషనల్ మెరిట్ స్కాలర్‌షిప్ కోసం అర్హత సాధించేందుకు కృషి చేసిన ఎన్‌ఎంఎంఎస్ ఇన్‌చార్జి పూర్ణయ్యను పాఠశాల ఉపాధ్యాయులు గౌస్, సేదేష్ణ, సువర్ణ, రమేశ్, అనిత, దీప్తి, వినోద, వెంకటేశ్, రఘుమోహన్, మధుతో పాటు విద్యార్థుల తల్లిదండ్రులు అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం



నర్సింలు(ఫైల్)

చేగుంట(తూప్రాన్): భార్యను పుట్టింటికి పంపించేందుకు వెళ్లిన వ్యక్తి అదృశ్యమైన కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ బాలరాజు తెలిపారు. ఎస్‌ఐ తెలిపిన వివరాల ప్రకారం.. చెట్ల తిమ్మాయిపల్లి గ్రామానికి చెందిన పొన్న నర్సింలు తన భార్యను పుట్టింట్లో దింపేందుకు గురువారం సాయంత్రం మక్కరాజీపేటకు వెళ్లాడు. భార్య కల్యాణిని దింపిన అనంతరం చెట్లతిమ్మాయిపల్లికి చేరుకోలేదు. నర్సింలు కుటుంబీకులు బంధువుల ఇళ్లలో వెతికినా.. ఆచూకీ లభించలేదు. దీంతో నర్సింలు తల్లి పొన్న బాలమణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

అక్రమంగా మట్టి తరలిస్తున్న రెండు టిప్పర్లు సీజ్

తూప్రాన్: అక్రమంగా మట్టి తరలిస్తున్న రెండు టిప్పర్లను పట్టుకొని సీజ్ చేసినట్లు ఎస్‌ఐ శివానందం శనివారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణ పరిధిలోని అల్లాపూర్ శివారు నుంచి పట్టణంలోని అభ్యాస స్కూల్ వైపునకు వస్తున్న రెండు మట్టి టిప్పర్లను రాత్రి వేళ పెట్రోలింగ్ నిర్వహిస్తున్న పోలీస్‌లు పట్టుకొని విచారించగా.. ఎలాంటి అనుమతులు లేవన్నారు. టిప్పర్లలో రాత్రి వేళల్లో ప్రభుత్వ భూముల నుంచి మట్టిని తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నట్లు తెలిపారు. రెండు టిప్పర్లు పోలీస్‌స్టేషన్‌కు తరలించి దర్యాప్తు చేపట్టగా మండలంలోని నాగులపల్లి గ్రామానికి చెందిన వెంగలి శ్రీనివాస్‌కు చెందినవిగా గుర్తించామన్నారు. దీంతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

ట్రాక్టర్ బ్యాటరీల చోరీ



ట్రాక్టర్ నుంచి బ్యాటరీ చోరీకి గురయ్యాయని చూపుతున్న రైతు ఎల్లం

చిన్నశంకరంపేట(మెదక్): పార్క్‌చేసిన ట్రాక్టర్లకు బ్యాటరీలను దుండగులు చోరీ చేసిన సంఘటన మండలంలోని కొర్విపల్లిలో శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. కొర్విపల్లి శివారులో పొలం పనులు ముగించుకొని కేజ్‌విల్ ట్రాక్టర్‌లను అక్కడే పార్కింగ్ చేసి వచ్చారు. గ్రామానికి చెందిన ట్రాక్టర్ యజమానులు ఎల్లం, యాదగిరి, శ్యామ్ శనివారం ఉదయం పొలం పనులు చేసేందుకు ట్రాక్టర్‌ను తీసేందుకు వెళ్లగా ట్రాక్టర్లకు బ్యాటరీలు చోరీకి గురైనట్లు గుర్తించారు. దీంతో వారు ఈ విషయం చిన్నశంకరంపేట పోలీస్‌లకు ఫిర్యాదు చేశారు.

అస్తవ్యస్తంగా విద్యుత్ సరఫరా

- నెల రోజులుగా పట్టించుకోని అధికారులు
- గిరిజనుల ఆగ్రహం



ఆందోళనకారులతో మాట్లాడుతున్న ఏఎస్‌ఐ

అల్లాదుర్గం (మెదక్): ఇష్టరాజ్యాంగా విద్యుత్ కోతలు విధిస్తూ అధికారులు అస్తవ్యస్తంగా విద్యుత్ సరఫరా చేస్తున్నారు. నెల రోజులుగా కరెంట్ ఎప్పుడు పోతుందో ఎప్పుడు వస్తుందో తెలియడం లేదని గిరిజనులు విద్యుత్ అధికారులకు ఫోన్ చేసినా.. స్పందించడం లేదని గిరిజనులు 161 రహదారిపై రాస్తారోకో చేసిన ఘటన శనివారం అల్లాదుర్గంలో చోటు చేసుకుంది. మండల పరిధిలోని గొల్లకుంట తండా విద్యుత్ సబ్‌స్టేషన్‌కు కూత వేటు దూరంలో ఉంది. నెల రోజులుగా కరెంట్ ఎప్పుడు పోతుందో తెలియడం లేదని గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. శుక్రవారం రాత్రి విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో గుర్తు తెలియని వ్యక్తులు వచ్చి మేకను ఎత్తుకుపోయారని చెప్పారు. కొంతకాలంగా కరెంట్ సరఫరా సక్రమంగా లేదని విద్యుత్ అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా.. పట్టించుకోవడం లేదన్నారు. రాత్రివేళ కరెంట్ పోతే విద్యుత్ అధికారులకు ఫోన్ చేస్తే ఎత్తడం లేదన్నారు. గిరిజన తండాలపై అధికారులు చిన్నచూపు చూస్తున్నారని మండిపడ్డారు. రాస్తారోకో చేయడంతో 161 హైవేపై వాహనాలు నిలిచిపోయి ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని వాపోయారు. ఈ విషయం తెలుసుకున్న ఏఎస్‌ఐ దేవిసింగ్ సంఘటన స్థలానికి చేరుకొని ఆందోళనకారులను సముదాయించారు. విద్యుత్ అధికారులతో ఫోన్లో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో గిరిజనులు ఆందోళనను విరమించారు.

4 కిలోల అండాశయ కణితి తొలగింపు

పాపన్నపేట(పాపన్నపేట): రెండు ఏళ్ల నుంచి కడుపు నొప్పితో ఇబ్బంది పడుతున్న మహిళ కడుపులో నుంచి 4 కిలోల అండాశయ కణితిని ఆపరేషన్ చేసి మెదక్ ఆస్పత్రి వైద్యులు తొలగించారు. మండల పరిధిలోని దౌలాపూర్ గ్రామానికి చెందిన 50 సంవత్సరాల మహిళకు శనివారం మెదక్ సాత్విక్ ఆస్పత్రిలో వైద్య పరీక్షల అనంతరం ఆపరేషన్ చేసి కణితి తొలగించినట్లు వైద్యులు డా. పిప్పిరి చంద్రశేఖర్ తెలిపారు. ఈ ఆపరేషన్‌లో వైద్యులు డా.వీణ, డా.నందకిశోర్ పాల్గొన్నారు. ప్రస్తుతం ఆపరేషన్ చేసిన మహిళా ఆస్పత్రిలో కోలుకుంటుంది

సామరస్యంగా పండుగలు చేసుకోవాలి



మాట్లాడుతున్న ఎస్‌ఐ నరేష్

పాపన్నపేట(మెదక్): పండుగలను సామరస్యంగా నిర్వహించుకోవాలని పాపన్నపేట ఎస్‌ఐ నరేష్ పేర్కొన్నారు. శనివారం పాపన్నపేట పోలీస్‌స్టేషన్‌లో ఆయన గ్రామ పెద్దలు, వివిధ మతాల ప్రతినిధులు, యువజన సంఘాలు, ప్రజాప్రతినిధులతో పీస్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. లౌకిక రాజ్యంలో అన్ని మతాల వారికి పూర్తి మత స్వేచ్ఛ ఉంటుందని తెలిపారు. త్వరలో జరగబోయే మొహరం, ఏకాదశి వేడుకలను ప్రశాంత వాతవారణంలో జరుపుకోవాలని కోరారు. సమాజంలో శాంతి భద్రతలు కాపాడటానికి పోలీస్‌లు ఎల్లప్పుడు సిద్ధంగా ఉంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో యుజవన సంఘాలకు చెందిన ప్రతినిధులు, యువజనులు పాల్గొన్నారు.

బోల్తా పడ్డ కారు



దెబ్బతిన్న కారు

హవేళిఘణాపూర్(మెదక్) : ఎదురెదురుగా రెండు కార్లు ఢీకొనడంతో నలుగురికి గాయాలు అయ్యాయి. పోలీసుల కథనం మేరకు.. కామారెడ్డి జిల్లా నాగిరెడ్డిపల్లి మండలం మల్తుమ్మెద గ్రామానికి చెందిన శశికాంత్ కుటుంబ సభ్యులతో కలిసి హైదరాబాద్ వెళ్తున్నారు. మెదక్ వైపు నుంచి వస్తున్న మరో కారు అతివేగంగా ఎదురుగా రావడంతో దానిని తప్పించబోయి శశికాంత్ కారు అదుపుతప్పి పల్టీకొట్టింది. ఈ ప్రమాదంలో శశికాంత్ కుమారుడు తోపాటు మరో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హవేళిఘణాపూర్ పోలీసులు తెలిపారు.

మహంకాళి ఆలయంలో భక్తుల పూజలు



మహంకాళి ఆలయంలో ప్రత్యేక పూజలు చేస్తున్న నాయకులు



ఆంజనేయస్వామికి పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

చేగుంట(తూప్రాన్): మండల కేంద్రం చేగుంటలోని మహంకాళి దేవాలయంలో శనివారం అన్నదానం నిర్వహించారు. వారాహిదేవి నవరాత్రుల సందర్భంగా గ్రామ నాయకులు సంద్రుగు ఆగం కాంగ్రెస్ నాయకులు సంద్రుగు సతీష్ ఆధ్వర్యంలో పూజలను నిర్వహించి అన్నదానం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు అర్చకుడు రఘువేంద్ర, నాయకులు పరంజ్యోతి, డిష్‌రాజు, రవితో పాటు భక్తులు పాల్గొన్నారు.

చాకరిమెట్లలో

శివ్వంపేట(నర్సాపూర్): ఉమ్మడి జిల్లాలో ప్రసిద్ధి చెందిన చాకరిమెట్ల సహకార ఆంజనేయస్వామి ఆలయంలో శనివారం భక్తజన సందడి నెలకొంది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. దంపతులు అభిషేకం అనంతరం సత్యనారాయణ స్వామి మండపంలో సామూహిక వ్రతాలు ఆచరించారు. భక్తులకు ఇబ్బందులు రాకుండా ఏర్పాట్లు చేసినట్లు ఆలయ ఫౌండర్, చైర్మన్ ఆంజనేయశర్మ, ఈఓ శ్రీనివాస్ అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధాన అర్చకుడు దేవాదత్తశర్మ, ప్రభుశర్మ తదితరులు ఉన్నారు.

వర్షాలు సమృద్ధిగా కురవాలి

- గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపల్ చైర్మన్ ఎన్‌సీ రాజమౌళి

గజ్వేల్: వర్షాలు సమృద్ధిగా కురిసి రైతులు సిరి సంపదలతో తులతూగాలని గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపల్ చైర్మన్ ఎన్‌సీ రాజమౌళి ఆకాంక్షించారు. శనివారం పట్టణంలోని మహంకాళి అమ్మవారి ఆలయంలో నిర్వహిస్తున్న బోనాల పండుగలో పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అమ్మవారి దయతో వానలు కురవాలని కోరుకున్నట్లు చెప్పారు. ఉత్సవాల్లో భాగంగా మహాపూజ, చండీ హోమం, శ్రీలలితా సహస్రనామ పారాయణం కార్యక్రమాలు జరిగాయి. భక్తులు భారీగా తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు అర్చకుడు, భక్తులు పాల్గొన్నారు.